కవితా కౌముది

# అరమోడ్పు కనులు

సుజాత పి.వి.ఎల్

నిరీక్షణలో నిర్గమించి..
కలలు మరచి
కలత నిదురలో
కలవరపడుతున్న కనులు
బలవంతంగా రెప్పలు వాల్చుతున్నాయి..
ముళ్ళతో ముడిపడిన జీవితం
ఎన్నటికీ
ఖరీదైన కలలు కనే సాహసం చేయలేదని తెలియక
సొమ్మసిల్లుతున్నాయి..
సంతోషాలన్నీ
నీతో పాటే రెక్కలొచ్చిన పక్షుల్లా ఎగిరిపోతే..
పెదవులపై చిరుదరహాస దివిటీని
వెలిగిచడం ఎలా సాధ్యం..?
కళ్ళలో కన్నీటి చారికలు
కనిపించకూడదన్న భావనతో
కాస్తంత నవ్వును ముఖానికి పులుముకొని
ఏదో అలా బతికేస్తున్నానేగానీ,
నిజానికి నీవులేని లోటుని భరించుట
గుండెకెంత భారమో తెలుసా!..
కనిపించనంత దూరానున్న నిన్ను
ఈ జన్మకు చేరుకోలేననేగా నీ ధీమా..
నీవు లేని భూతలం
శూన్యాకాశమే నాకు.
అందుకే..
నిను చేరలేని దూరాన్ని తుడిచేస్తూ
నీ దగ్గరికొచ్చేస్తున్నా..
కళ్ళమాటు దాగిన జ్ఞాపకాల తలపు తెరలను
తెంచుకొంటూ..
ఆఖరిసారిగా అవలోకిస్తున్నాయి
అరమోడ్పు కనులు..

★★★

# అసలు ఉనికి

శ్రీ వశిష్ఠ సోమేపల్లి

ఆవిరవ్వడం ఎంతసేపు!

కదలని నీరై చినుకు కోసం ఎన్నాళ్ళు చూసేది

ఎత్తులూ పల్లాలే కదా కదిలించేది

పోనీ మనల్ని వూపిరి పీల్చే దేహాలుగా మాత్రమే కుదించుకుందామా?

ప్రవహించాలి!

చలనమూ, చప్పుడూ మాత్రమే సంఘజీవి బతుకు అసలు వునికి.

★★★

# రసరేఖలు శ్రీధర్ బచ్చోటి

ఏది నాదారి? యేదారి నాది కాదు?
చేయదగునేది? యెయ్యది చేయదగదు?
మనసు చెప్పిన మాటయే మంచిదగునా!
బుద్ధి సూచించు త్రోవనే పోవవలెనా!

జన్మమెల్లను దుఃఖభాజనము కాగ
అనవరతమును బ్రతుకున వ్యధలునిండ
క్లేశములనెల్ల జేతునాశ్లేషమెట్లు?
ఇడుమలను వీడి యెచటికో యేగుటెట్లు?

ఎన్నడో నాదు బుద్ధి నిద్రించినపుడు
ఏదొ స్తబ్ధత నన్నావహించినపుడు
మనసు గొనిపోవు రోదసీమార్గమునకు
తిరిగి పోవలదంచు బోధించుచుండు

వ్యధల సాంగత్యమో! పలాయనమొ! ఎదురు
నిలచి పోరుటయో! యోడి తలను వంచి
సతము కుందుటో! ఏది నిశ్చయము నాకు?
సాధ్యమెయ్యది? తలపనసాధ్యమేది?

ఇడుమలను వీడ సాధ్యమ్ము పుడమి వెడలి
వీడి యెటకేగ గలము? ప్రాప్తించునేమి?
ధైర్యముగనెదుర్కొనుట కర్తవ్యమౌను
వెన్ను చూపిననాంధ్యమ్మె వెలుగు లేదు

COMMENTS